# నిస్వార్థ ప్రేమను పెంపొందించునదే నిజమైన విద్య

విద్యార్థులారా! విద్యకు గమ్యమనేది ఒకటున్నది. అదే సత్యము. సత్యమును విస్మరించి ఏమి నేర్చుకున్నా అది విద్య కానేరదు. అది కేవలం ప్రాకృతమైన చదువు. ఈ జగత్తులో కోట్లకొలదీ విద్యావంతులున్నారు. కాని, వీరంతా చేస్తున్న పని ఏమిటి? పరోపకారమనేది ఎక్కడా కనిపించడం లేదు. 'విద్యావంతుల' సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉన్నది. ఆధ్యాత్మిక విద్యయే నిజమైన విద్య. అదొక్కటే దైవాన్ని నిరూపించేది. ఈ భౌతికమైన చదువులు కేవలం పొట్టకూటికి, కుటుంబ పోషణకు మాత్రమే ఉపయోగ పడతాయి. ఇవి ప్రపంచాన్ని ఆకట్టుకోవడానికే తప్ప ఆత్మోన్నతికి ఏమాత్రం దోహదం చేయడం లేదు. The end of education is character. శీలసంపద లేకుండా ఎన్ని ఉండియు ప్రయోజనం లేదు. అంతర్ముఖమైన భావము, బహిర్ముఖమైన చర్య ఒక్కటిగా ఉండాలి. అట్టి గుణమే లేకపోతే ఈ చదువులన్నీ నిష్ప్రయోజనమైనవి. మనము చదివే చదువులు భక్తిని పెంపొందించేవిగాను, యూనిటీని పోషించేవిగాను ఉండాలి. యూనిటీ ద్వారానే మనకు డివినిటీ లభిస్తుంది.

### శీలసంపద లేనివాడు పశుసమానుడు

ఆధునిక విద్య కేవలం స్వార్థాన్ని ప్రేరేపిస్తున్నది. ఎక్కడ చూసినా అంతా స్వార్థం, స్వార్థం! నిజమైన విద్య నిస్వార్థప్రేమను పెంపొందిస్తుంది. స్వార్థాన్ని త్యజించి పరోపకారార్థం పాటుపడేవారే నిజమైన విద్యావంతులు. 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం'. ఈనాటి మానవుడు ఏ పనైనా చేసేముందు అది తన స్వార్థానికి ఉపయోగపడుతుందా లేదా అని యోచిస్తున్నాడు. తనయందున్న ఆత్మయే అందరియందున్నదనే సత్యాన్ని తాను విస్మరిస్తున్నాడు. స్వార్థాన్ని వదలిపెట్టి ఆత్మతత్త్వమును అనుభవించాలి. అప్పుడే హృదయము పరిశుద్ధమవుతుంది. ఆత్మకు



sri sathyasaivachanamrutam

చైతన్యశక్తి అని పేరు. ఈ చైతన్యశక్తి ప్రతి జీవియందు ఉన్నది. కనుకనే, 'ఈశ్వరస్సర్వ భూతానాం', అన్నారు. కేవలం లౌకికమైన చదువులవల్ల మానవత్వము పోషింపబడదు. త్యాగభావముతో ఇతరులకు తోడ్పాటు నందించినప్పుడే మానవుడు నిజమైన మానవునిగా తయారవుతాడు. పశు, పక్షి, మృగాదులకు తమయందున్న ఆత్మతత్త్వమును గ్రహించి నిస్వార్థభావాన్ని ప్రకటించడం సాధ్యం కాదు. ఒక్క మానవునికి మాత్రమే అది సాధ్యం. శీలసంపదవలననే మనిషికి విలువ చేకూరుతుంది. శీలసంపద లేనివాడు మనిషే కాడు, పశువు అనే చెప్పవచ్చు. అలాంటివానికంటే పశువులే మేలు. వాటికైనా ఒక రీజన్, సీజన్ ఉంటాయి. కాని, ఈ మనిషికి 'నో రీజన్', 'నో సీజన్'! చదువులు చదవడం కేవలం జేబులు నింపుకోవడం కోసం కాదు. Characterను కాపాడుకోవడానికి తగిన చదువు చదవాలి. డబ్బుతో భవనాలు కట్టించవచ్చు, గొప్ప పేరు తెచ్చుకోవచ్చు. కాని, శీలసంపద లేకపోతే ఎంత డబ్బు సంపాదించి ఏమి ప్రయోజనం? దురదృష్టవశాత్తు ఈనాడు లోకముకూడా అట్టివారినే గౌరవిస్తున్నది. సత్యధర్మములే శీలసంపదకు ఆధారం. 'సత్యాన్నాస్తి పరో ధర్మః', సత్యమనే పునాదిపైననే ధర్మమనే భవనము నిలిచియున్నది. సత్యధర్మములు రెండూ చేరినప్పుడే ప్రేమ ఆవిర్భవిస్తుంది. సత్య, ధర్మ, ప్రేమలు లేకున్న మానవునికి శాంతియే లేదు.

**అశాంతికి మూలం ప్రాపంచిక వ్యామోహం**

మీరు ఎవరినైనా ఒక శ్రీమంతుని అడగండి. 'నాకు అన్నీ ఉన్నాయిగాని, మనశ్శాంతి లేదు', అంటాడు. శాంతి లేనివానికే ఇన్ని రకములైన అవస్థలు! నిజంగా మానవుడు ఎంతో పుణ్యాత్ముడు. అనేక జన్మల పుణ్యఫలముచేతనే మానవజన్మ లభిస్తుంది. అసలు 'మానవ' అంటే అర్థమేమిటి? 'మా' అనగా ప్రాపంచిక వ్యామోహము. 'న' అనగా లేకుండా. 'వ' అనగా వర్తించడం. 'ఎటాచ్‌మెంట్' లేకుండా ఉన్నవాడే నిజమైన మానవుడు. పెళ్ళి చేసుకోవడం, పిల్లల్ని కనడం, కుటుంబాన్ని పెంచుకోవడం... ఇటువంటి 'ఎటాచ్‌మెంట్'చేతనే మానవుడు అశాంతిని పొందుతున్నాడు. మానవునికి తిండికి లోటు లేదు. సుఖాలకేమీ తక్కువ లేదు. ఎక్కడికైనా వెళ్ళవచ్చు. దేనినైనా సంపాదించవచ్చు. కాని,

sri sathyasai vachanamrutam

శాంతిని మాత్రం ఎక్కడినుండో తెచ్చుకోవడానికి వీలుకాదు. Peace (శాంతి) కావాలంటే ఈ కనిపించే Pieces అన్నింటినీ పారవేయాలి. వీటివల్ల నీకూ సుఖము లేదు, ఇతరులకూ సుఖము లేదు. ఏకాత్మ భావముతో స్వేచ్ఛగా సంచరించాలి. ఏకాత్మభావము లేకపోవడంవల్లనే మానవుడు 'ఎటాచ్‌మెంట్'లో చిక్కుకొని బంధితు డవుతున్నాడు. Lust (కామము) వచ్చినప్పుడు Love (ప్రేమ) దూరమై పోతుంది. Attachment వలన మనకు బంధన చేకూరుతుంది, Detachment వలన ఎంతో సుఖము కలుగుతుంది. కాబట్టి, Attachment గాని, కోరికలుగాని లేకుండా పవిత్రమైన ప్రేమను అభివృద్ధిపరచుకున్నప్పుడే మానవుడు మానవునిగా జీవించగలడు.

**ఆశలను వదలుకోవడమే సన్యాసము**

ఆదిశంకరులు అద్వైత సిద్ధాంతమును ప్రచారము గావిస్తూ ఉత్తర దేశమునకు వెళ్ళినప్పుడు అక్కడ మండనమిశ్రుడనే పండితునితో వాదోపవాదములు సల్పారు. మండనమిశ్రుడు తాను ఓడిపోయినట్లైతే సన్యాసము స్వీకరిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. వాదప్రతివాదములు జరిపి నప్పుడు ఎవరు జయించారనేది చెప్పడానికి ఎవరైనా సాక్ష్యము ఉండాలి కదా! మండనమిశ్రుని ధర్మపత్నియైన ఉభయభారతి మహాజ్ఞాని. సత్యమును నిర్ణయించడంలో ఆమెకు ఎవ్వరూ సాటిరారు. సత్యమే దైవం. దానిని మనస్సులో పెట్టుకొని శంకరులవారు ఆమెను సాక్షిగా ఉండమని కోరారు. 'నా భార్య నాకు సాక్షిగా ఉండవచ్చునా?' అని మండనమిశ్రుడు అడిగాడు. 'సత్యము నిర్ణయించటానికి ఎవరైతేనేమి?! భార్యయైనా, బిడ్డయైనా, తల్లియైనా ఒక్కటే. కాబట్టి, తప్పక ఉండవచ్చు' అన్నారు శంకరులవారు. ఆమె ఇరువురికీ మధ్య నిలబడింది. ఇరువురూ అడిగే ప్రశ్నలను, చెప్పే సమాధానములను విన్నది. చివరికి, శంకరులదే విజయమని తీర్పు చెప్పింది. మండనమిశ్రుడు మాట ప్రకారం సన్యాసం స్వీకరించాడు. భర్తతోపాటు ఉభయభారతికూడా సన్యాసం స్వీకరించింది. సన్యాసమంటే ఏమిటి? సర్వ ఆశలను వదలుకోవడమే సన్యాసము. ఆశలున్నంతవరకు వాడు సంసారియేగాని, సన్యాసి కాజాలడు. సంసారిగా ఉన్నప్పుడు అనేకమందితో సంబంధము ఏర్పడుతుంది. ఒక

srisathyasaivachanamrutam

పుత్రుడు కలిగాడంటే తరువాత కోడలు వస్తుంది. తరువాత మనుమలు వస్తారు. ఈరీతిగా 'ఎటాచ్‌మెంట్' పెరిగిపోతుంది.

ఒకరోజున ఉభయభారతి తన శిష్యురాండ్రతో కలసి స్నానమునకై గంగానదికి వెళుతున్నది. వాళ్ళు వెళ్ళే మార్గములో ఒక చెట్టుక్రింద ఒక సన్యాసి తాను నీరు త్రాగడానికి ఉపయోగించే బుఱ్ఱను ఎవరైనా దొంగిలిస్తారేమో అనే భయంచేత తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు. అది చూసి ఉభయభారతి, "ఇతనికి నీటిబుఱ్ఱపైన అభిమానము పోలేదు. కాబట్టి, ఇతను సన్యాసి కాదు, సంసారియే" అని అతనికి వినపడేటట్లుగా పలికింది. ఆ మాటలు అతనికి కోపం తెప్పించాయి. వాళ్ళు తిరిగి వస్తూండగా అతడా బుఱ్ఱను తీసి విసిరేశాడు. అది చూచి ఉభయభారతి, "అయ్యో, ఇతనిలో అభిమానమే కాదు, అహంకారముకూడా ఉన్నది. అభిమాన, అహంకారములను త్యజించనివాడు సన్యాసి కాజాలడు" అని అన్నది.

**మనం సంచరించే ప్రదేశముకూడా మన ప్రవర్తనపై ప్రభావము చూపుతుంది**

ఈనాడు కొందరు అన్నీ వదలిపెట్టినట్లుగా కనిపిస్తారు. కాని, లోలోపల మాత్రం అన్నీ కావాలని ఆశిస్తుంటారు. కొందరు స్వామిదగ్గరకు వచ్చినప్పుడు, 'స్వామీ! నాకు ఇల్లు, పెళ్ళి పేరంటములు యేమీ వద్దు. నాకు ముక్తినిచ్చే మార్గము చూపండి', అంటారు. కాని, ప్రశాంతి నిలయం కాంపౌండు దాటుతూనే వారిని కోరికలు చుట్టుకుంటాయి. మనిషి ప్రవర్తన స్థాన బలము, భుజబలము, ధనబలము ఈ మూడింటిపైన ఆధారపడి ఉంటుంది. కనుక, మనము సరియైన స్థానంలో ఉన్నామా లేదా అనేదికూడా చూసుకోవాలి. రామలక్ష్మణులు అరణ్యంలో సంచరించే సమయంలో లక్ష్మణుడు ఒక చెట్టు క్రిందికి పోయి కూర్చున్నాడు. వెంటనే అక్కడినుండి లేచి వచ్చి, 'ఛీ, ఈ అడవిలో నేనెందుకుండాలి! తక్షణమే అయోధ్యకు వెళ్ళిపోతా', అన్నాడు. ఏనాడూ రామాజ్ఞను జవదాటని లక్ష్మణుడు ఆ సమయంలో రాముని మాటలకుకూడా విరుద్ధంగా మాట్లాడడం ప్రారంభించాడు. అప్పుడు రాముడు, 'తమ్ముడా! మనము కాస్త ముందుకు వెళదాము. ఈవిషయాన్ని గురించి మళ్ళీ మాట్లాడుకోవచ్చు' అన్నాడు. ఆ ప్రాంతాన్ని వదలిపెట్టి కొంతదూరం వెళ్ళిన తరువాత

srisathyasaivachanamrutam

లక్ష్మణుడు రాముని పాదాలు పట్టుకున్నాడు. 'అన్నా! నాకు తెలియకుండా నాలో ఏదో రాక్షస గుణము ప్రవేశించింది. నీ మాటలకు విరుద్ధంగా నేను మాట్లాడాను. నన్ను క్షమించు' అని ప్రార్థించాడు. అప్పుడు రాముడు, 'లక్ష్మణా! అది రాక్షసులు సంచరించే ప్రదేశము. కనుకనే, ఆ ప్రాంతంలో ఉన్నప్పుడు నీలో రాక్షస బుద్ధులు ప్రవేశించాయి' అన్నాడు.

**మంచివారితో స్నేహం చేయండి, మంచి పుస్తకాలు చదవండి**

పుత్రుడు పుట్టాలని తల్లిదండ్రులు ఆశిస్తుంటారు. అయితే, పుత్రుడు ఎట్లా ఉండాలి? తల్లిదండ్రుల మంచి గుణములు వానిలో ప్రవేశించాలి. సద్గుణములు, సదాచారములు లేని పుత్రుడు పుట్టి ప్రయోజనమేమిటి? వాడు చెడు సహవాసాలు చేస్తాడు. తానుకూడా తన స్నేహితులమాదిరి తయారవుతాడు. మనం మంచివారితో స్నేహము చేయాలి. అందరితోనూ స్నేహంగా ఉండవచ్చును. కాని, చెడ్డ గుణములు గలవారికి మనం దూరంగా ఉండాలి.

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తి**

ఈనాడు జనులు దుస్సంగముచేత దుర్మార్గములో ప్రవేశిస్తున్నారు. అందుకోసమే, కలియుగము కలహయుగముగా మారిపోయింది. మానవునిలో స్వతః ఎట్టి దోషమూ లేదు. దుస్సంగముచేతనే తాను చెడిపోతున్నాడు. భక్తులైనవారు తమలోని దోషాలను తెలుసుకొని సరిదిద్దు కోవాలి. ఈనాడు చెడ్డ పుస్తకాలు ఎక్కువైపోయాయి. విద్యార్థులు చదివే పుస్తకాలు, నవలలు వారిలో దోషాన్ని పెంచేవిగా ఉన్నాయేగాని, హృదయాన్ని పవిత్రం గావించేవిగా లేవు. పిల్లలు లైబ్రరీకి పోయినప్పుడు మొట్టమొదట చెడ్డ పుస్తకాలు, నవలలు ఎక్కడున్నాయని వెతుకుతారు. వాళ్ళు శ్రద్ధగా ఏవో తమ పాఠ్యపుస్తకాలకోసం వెతుకుతున్నట్లు నటిస్తారు. తీరా వాళ్ళు తీసికొని చదివేవి చూస్తే పిచ్చి పుస్తకాలు! చెడ్డ పుస్తకాన్ని లోపల పెట్టుకొని దానిపైన వేరే కవరు వేస్తారు. దానిని తెరచి చూస్తే అన్నీ చెడ్డ ఫోటోలు, చెడ్డ విషయాలు! అటువంటి పుస్తకాలను విద్యార్థులు ఆసక్తిగా చదువుతున్నారు. వారిని ఏ దేవుడూ మార్చడానికి వీలుకాదు. వారి మాటలు వినడానికి చాలా మధురంగా

srisathyasaivachanamrutam

ఉంటాయి. కాని, వాళ్ళ నడత చూస్తే దానికి పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అటువంటి విద్యార్థులపట్ల అధ్యాపకులు కఠినంగా వ్యవహరించాలి. నడత చాలా ముఖ్యం. అది మంచిగా ఉన్నప్పుడే మానవుడు జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలడు. నడత మంచిగా ఉండాలంటే సత్సంగములో చేరాలి. మంచి పుస్తకాలు చదవాలి.

**ప్రేమయే ప్రధానమైన చదువు**

పూర్వము గురువులదగ్గర శిష్యులు ఎంతో వినయ, విధేయతలతో మెలగేవారు. కాని, నేటి విద్యార్థులలో అధ్యాపకులపట్ల గౌరవ భావము శూన్యమైంది. విద్య నేర్పినవారినే వెక్కిరిస్తున్నారు. కూడు పెట్టినవారినే కూలద్రోస్తున్నారు. 'సద్గుణంబులు, సద్బుద్ధి, సత్య నిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్య పాలనము' – ఇలాంటి గుణములు కల్గినవానినే 'స్టూడెంట్' అనవచ్చు. వీటికి విరుద్ధంగా ప్రవర్తించేవానిని 'స్టుపిడ్' అంటారు. ఇలాంటి 'స్టుపిడ్'తో మనం చేరవద్దు. అయితే, వానిని 'స్టుపిడ్' అనికూడా నీవు పిలువవద్దు. వానితో మంచీ వద్దు, చెడ్డా వద్దు. వానిని వానిగానే వదలిపెట్టి నీవు నీవుగానే ఉండు. అప్పుడే నీవు బాగుపడతావు. నిన్ను జనులంతా మెచ్చుకుంటారు. అందరినీ నీవు ప్రేమించాలి. ప్రేమయే ప్రధానమైన చదువు. ప్రేమను పెంచుకునే విధానము బోధించేవాడే నిజమైన గురువు. అటువంటి టీచర్లు ఈనాడు ఎంతోమంది ఉన్నారు. మంచి పిల్లలను తయారు చేయాలనే ఉద్దేశ్యంతోనే నేను ఈ విద్యాలయాలను స్థాపించాను. మా లైబ్రరీలో ఒక్క చెడ్డ పుస్తకంకూడా ఉండదు. టీచర్లు చెప్పినట్లుగా పిల్లలు వింటారు. సెలవులకు తమ ఇంటికి వెళ్ళినా అక్కడ ఎక్కువ కాలము ఉండటానికి ఇష్టపడరు.

**'ఫుడ్' - 'హెడ్' - 'గాడ్'**

'నాయనా! నీవు సంవత్సరమంతా పుట్టపర్తిలో ఉంటున్నావు. నీకు మంచి రుచికరమైన ఆహారం వండిపెడతాను', అని ఇంటి దగ్గర తల్లి ఎంతో 'ప్రేమ'తో రజోగుణ సంబంధమైన ఆహారాన్ని వండిపెట్టడానికి ప్రయత్నిస్తే, 'అమ్మా! ఇటువంటి ఆహారము మీరుకూడా తినకూడదు. తిండి ఎట్టిదో తిప్పలు అట్టివి. ఈ 'ఫుడ్'యొక్క ప్రభావము మన 'హెడ్'లో

చేరిపోతుంది. తద్వారా మనం 'గాడ్'ని మరచిపోతాము. కాబట్టి, మీరు మంచిగా ఆకు కూరలు తీసుకోండి. కూరగాయలు తినండి. అంతేగాని, ఈ పిచ్చి తిండి తినకూడదు' అని హితవు చెబుతారు, మా పిల్లలు.

విద్యార్థులారా! 'సత్యసాయి హాస్టల్లో చదివే పిల్లలు చాలా మంచివారు', అని బయట ప్రతి ఒక్కరు మాట్లాడుతుంటారు. కాబట్టి, మీరు ఏమైనా తప్పు మార్గము పడితే, 'అయ్యా, నీవు సత్యసాయి విద్యాసంస్థలో చదివావు. ఇలాంటివి చేయవచ్చునా?' అని వారే మీకు బుద్ధి చెబుతారు. మీ ప్రవర్తన ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉండాలి. ఇతరులచేత బుద్ధి చెప్పించుకునే స్థితికి మీరు దిగజారకూడదు. మీరంతా చాలా మంచి పిల్లలు. ఇలాంటి స్టూడెంట్స్ చిక్కడం చాలా అరుదు. మీరు ఇతరులకు ఆదర్శం అందించేటట్లుగా తయారు కావాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**– శ్రీవారి దివ్యబోధ, తేదీ 22.11.2005 స్నాతకోత్సవం**

sri sathyasai vacharamrutam